క్లుప్తంగా

14న ఆర్టిజన్ల సమ్మె విజయవంతం చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న కార్మికులు

ఆసిఫాబాద్అర్బన్: ఈ నెల 14వ తేదీ నుంచి తలపెట్టిన విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ జిల్లా చైర్మన్ ఆత్రం మారుతి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ జిల్లా కార్యాలయం ఆవరణలో కార్మికులతో కలిసి సమ్మెకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. కార్మికులు ఐక్యంగా పోరాడి హక్కులు సాధించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఏకాంబరం, బుచ్చిబాబు, అశోక్, శ్రీనివాస్, శ్రీకాంత్, మారుతి, చంద్రయ్య, సలీంపాషా, మోహన్, సత్యం, శ్యాం, తదితరులు పాల్గొన్నారు.

ఏఐ బోధన సద్వినియోగం చేసుకోవాలి



ఏఐ తరగతులు ప్రారంభిస్తున్న హెచ్ఎం

పెంచికల్పేట్: ఏఐ బోధనను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పెంచికల్పేట్ కాంప్లెక్స్ హెచ్ఎం విజయ నిర్మల అన్నారు. మండలంలోని సంజీవనగర్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఏఐ తరగతులను ప్రారంభించారు. ఉపాధ్యాయులు సాధారణ తరగతులతో పాటు విద్యార్థులను డిజిటల్ బోధన వైపు మళ్లించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం సుజాత, ఉపాధ్యాయులు ప్రియాంక, సతీశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ



మంజూరు పత్రాలు అందజేస్తున్న నాయకులు

వాంకిడి: మండలంలోని పాతగూడ గ్రామ పంచాయతీ పరిధిలో గల ఎనోలి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంగళవారం మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూమ్ల పేరుతో రాష్ట్ర ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చిందని పేర్కొన్నారు. నాయకులు అనిల్, సెల్వట్కార్ పెంటు, బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

'బంజరుదొడ్డి ఏర్పాటు చేయాలి'



వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

బెజ్జూర్: పశువులు వీధుల్లో సంచరిస్తూ ప్రయాణికులతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని మండలకేంద్రం వాసులు పేర్కొన్నారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శి వైకుంఠంకు వినతిపత్రం అందజేశారు. బంజరుదొడ్డి ఏర్పాటు చేసి పశువులను నియంత్రించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పశువుల నియంత్రణ కోసం ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలన్నారు.

చికిత్స పొందుతూ ట్రాక్టర్ డ్రైవర్ మృతి



దుర్గం మారుతి (ఫైల్)

రెబ్బెన: మండల కేంద్రంలోని జర్నలిస్టు కాలనీ వద్ద ఈనెల 3వ తేదీన జాతీయ రహదారిపై ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో తీవ్రంగా గాయపడిన డ్రైవర్ దుర్గం మారుతి (27) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రెబ్బెన వైపు నుంచి పులికుంట వైపు ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ డివైడర్ను ఢీకొట్టి బోల్తాపడింది. ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ దుర్గం మారుతి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆయనను వెంటనే స్థానిక పీహెచ్సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'గుండాల'కు సమస్యల గండం

- అభివృద్ధికి ఆమడదూరం
- రోడ్డు సౌకర్యం కరువు
- కాలినడకే శరణ్యం
- పట్టించుకోని అధికారులు



కాలినడకన వెళ్తున్న గ్రామస్తులు (ఫైల్)

తిర్యాణి: మండలంలోని గుండాల గ్రామం సమస్యలతో సతమతమవుతోంది. చుట్టూ పచ్చని అడవి, ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న గ్రామంలో మౌలిక సదుపాయాలు లేక గ్రామస్తులు నానా తంటాలు పడుతున్నారు. గుండాల గ్రామ పంచాయతీ పరిధిలో ఏడు గూడాలు ఉండగా 1000కి పైగా జనాభా ఉంది.

సేంద్రియ వ్యవసాయం.. అందమైన జలపాతం

గుండాల గ్రామంలో నేల రాతిమయంగా ఉండటంతో వ్యవసాయనికి ఏ మాత్రం అనువుగా ఉండదు. అటువంటి నేలపై గ్రామంలోని బొజ్జు అనే యువకుడు రాతినేలపై చెరువుమట్టి పోసి రసాయనిక ఎరువులు వాడకుండా సేంద్రియ పద్ధతుల్లో పంటలు సాగు చేస్తూ అధిక దిగుబడులు పొందుతున్నాడు. ప్రస్తుతం గ్రామం మండలంలోనే సాగులో ఆదర్శవంతంగా నిలుస్తోంది. ఇక్కడి పంటలకు బహిరంగ మార్కెట్లో డిమాండ్ ఉంటుంది. గ్రామ శివారులోని దట్టమైన అడవిలో అందమైన గుండాల(బాహుబలి) జలపాతం ఉంది. చుట్టూ పచ్చని చెట్ల మధ్య వంద అడుగుల ఎత్తు నుంచి నీళ్లు కిందకు జాలువారుతూ ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. అయితే గ్రామానికి వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గం కూడా లేదు.

రోడ్డు నిర్మాణమే పరిష్కారం..

రోడ్డు సమస్య గ్రామస్తుల అభివృద్ధికి నిరోధకంగా మారుతోంది. రోంపెల్లి నుంచి గుండాల గ్రామం వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా అటవీశాఖ అనుమతులు లేక నిర్మాణ పనులు జరగడం లేదు. దండేపల్లి వయా ఉట్ల మీదుగా రోడ్డు నిర్మాణం చేపట్టే అవకాశం ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. రోడ్డు నిర్మాణం జరిగితే కాలినడక కష్టాలకు చెక్ పడే అవకాశం ఉంది.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



రోంపెల్లి నుంచి గుండాల వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా అటవీశాఖ అనుమతులు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. రేషన్, పింఛన్, ఉన్నత విద్య, వైద్యం వంటి అవసరాలకు కాలినడకనే వెళ్తున్నాం. అత్యవసర సమయంలో అనేక అవస్థలు పడుతున్నాం. వెంటనే మా గ్రామానికి తారురోడ్డు నిర్మించాలి. – శంకర్, గుండాల

పర్యాటకాభివృద్ధికి అవకాశం



మా గ్రామానికి రోడ్డు నిర్మాణం జరిగితే పర్యాటకంగా అభివృద్ధి చెందుతుంది. దీంతో పాటుగా గ్రామంలో చదువుకున్న నిరుద్యోగులకు జలపాతం వద్ద ఉపాధి అవకాశాలు లభిస్తాయి. సేంద్రియ పద్ధతుల్లో పండించే పంటలను నేరుగా బహిరంగ మార్కెట్లో అమ్ముకునే అవకాశం కలుగుతుంది. – మర్సుకోల అశోక్, గుండాల

ఈవీఎంల భద్రతకు పటిష్ట చర్యలు



గోదాం పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: ఈవీఎంల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాంను మంగళవారం తనిఖీ చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎంల గోదాముల వద్ద సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. 24 గంటల పాటు సీసీ కెమెరాలు పనిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం గోదాంలోని రిజిస్టర్లు, భద్రతా ప్రమాణాలు పరిశీలించారు. ఆయన వెంట డీటీ శ్యాంలాల్, అధికారులు తదితరులు ఉన్నారు.

జీవో 49 వెంటనే రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

పెంచికల్పేట్: టైగర్ కన్జర్వేషన్ కోసం ప్రభుత్వం విడుదల చేసిన జీవో 49 వెంటనే రద్దు చేయాలని ఆదివాసీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం మాట్లాడుతూ ప్రభుత్వం జీవో 49 పేరుతో ఆదివాసీలను అడవుల నుంచి తరిమివేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని విమర్శించారు. ఆదివాసీ కోయ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి సిడాం అశోక్, మండల అధ్యక్షుడు సకారాం, రాజ్ గోండ్ సేవా సమితి మండల అధ్యక్షుడు సిడాం మల్లేశ్, నాయకులు మడ్డి శ్రీనివాస్, భుజరంగరావు, పొర్తెటి సర్దార్, చుక్కయ్య, మధునయ్య తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్: టైగర్ జోన్ రద్దు చేయకుంటే తాడోపేడో తేల్చుకుంటామని ఆదివాసీ నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మండల ఆదివాసీ అధ్యక్షుడు కొరేత తిరుపతి మాట్లాడుతూ టైగర్ జోన్ రద్దు చేయాల్సిందేనని, జీవో 49 తీసుకురావడం అన్యాయమన్నారు. ఆదివాసీ సంఘం గౌరవ అధ్యక్షుడు సకారాం, ఆదివాసీ కోయ సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ సోయం చిన్నన, సర్మెడి శంకర్, ఆదివాసీ నాయకులు, తుడుందెబ్బ నాయకులు, గొండ్వానా పంచాయితీ రాయిసెంటర్ నాయకులు పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ముంజం శ్రీనివాస్

కాగజ్నగర్టౌన్: నేడు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్ యూనియన్ నాయకులు శంకర్, సంజీవ్, రవి, రమేశ్, అశోక్, శ్రీనివాస్, లక్ష్మణ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: కార్మిక వర్గాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను కార్మికులు సమ్మెతో తిప్పికొట్టాలని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ముష్క సమ్మయ్య అన్నారు. బుధవారం జరగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. బెల్లంపల్లి ఏరియాలోని ఖైరగూర ఓసీపీలో జేఏసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. జేఏసీ నాయకులు ఎస్.తిరుపతి, మల్రాజు శ్రీనివాస్రావు, బయ్య మొగిళి, పేరం శ్రీనివాస్, ప్రకాశ్రావు, వెంకటేశ్, రాజేశ్, కిరణ్బాబు, చంద్రశేఖర్, మాధవకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో పాల్గొనాలి..

దేశవ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులంతా పాల్గొనాలని ఏఐటీయూసీ రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ అన్నారు. మంగళవారం గోలేటిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు నర్సయ్య, సాగర్గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో 'మన అమ్మకు మన సారె'



వాసవీమాతకు పూజలు చేస్తున్న మహిళలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని వాసవి మందిరంలో కాగజ్నగర్కు చెందిన జిల్లా మహిళా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 'మన అమ్మకు మన సారె' కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీమాతకు చీరె, సారె సమర్పించారు. అంతకు ముందు అర్చకులు రాజశేఖర శర్మ ఆధ్వర్యంలో వాసవీమాతకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాచకొండ నాగేశ్వర్ రావు, ఆర్యవైశ్య ప్రతినిధులు తాటిపెల్లి అశోక్, పాత శ్రీనివాస్, రావుల శంకర్, గుండ ప్రమోద్, రావుల మురళీధర్, ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

నిషేధిత గ్లైఫోసెట్ పట్టివేత



వాంకిడి: నిందితులతో పోలీసులు

చింతలమానెపల్లి: మండలంలోని గూడెం వద్ద సోమవారం రాత్రి గ్లైఫోసెట్ తరలిస్తుండగా ఇద్దరిని పట్టుకున్నట్లు ఎస్సై ఇస్లావత్ నరేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ముందస్తు సమాచారంతో గూడెం చెక్పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా బాబాసాగర్ గ్రామానికి చెందిన కోట శంకర్ గ్లైఫోసెట్ తరలిస్తూ పట్టుబడ్డాడు. అతని వద్ద రూ.16వేల విలువైన గ్లైఫోసెట్ మందు లభ్యమైంది. మండలంలోని ఖర్జెల్లి శివారులో నిర్వహించిన తనిఖీలలో సారసాల గ్రామానికి చెందిన పూసల క్రిష్ణ వద్ద రూ.24వేల విలువైన 30లీటర్ల గ్లైఫోసెట్ గడ్డిమందు లభ్యమైంది. ఈమేరకు గడ్డిమందును, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వాంకిడి: అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గడ్డి మందును సోమవారం రాత్రి వాంకిడి పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్స్టేషన్ శివారులో ఏఎస్సై పోషెట్టి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈక్రమంలో మహారాష్ట్ర వైపు నుంచి ఆసిఫాబాద్ వైపునకు అనుమానాస్పదంగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న మంచిర్యాల జిల్లా భీమిని మండలానికి చెందిన ఇందూరి అశోక్, ఇందూరి చంద్రశేఖర్లను తనిఖీ చేయగా వారి వద్ద ప్రభుత్వం నిషేధించిన 40 లీటర్ల గడ్డి మందు లభ్యమైంది. వ్యవసాయ విస్తరణ అధికారి అరుణ్ సమక్షంలో పంచనామా నిర్వహించి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

పెంచికల్పేట్: డ్రైవర్లు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై అనిల్ కుమార్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని పోలీసుస్టేషన్లో ట్రాక్టర్ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కేజీవీల్స్కు ఇనుప పట్టీలు అమర్చుకోవాలన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను తరలించొద్దని సూచించారు.

చిన్నారులకు బ్యాగులు విరాళం

కెరమెరి: సిద్దిపేట్ జిల్లాకు చెందిన గీత రచయిత, సంగీత దర్శకుడు, గాయకుడు రాయారావు విశ్వేశ్వర్రావు ఆధ్వర్యంలో ఎంఈవో ఆడే ప్రకాశ్, సావర్ఖెడ ప్రధానోపాధ్యాయుడు కడేర్ల రంగయ్య మండలంలోని ప్రాథమిక పాఠశాల, ధనోరా (ఉర్దూ మీడియం), భీమయన్గోంది పాఠశాల విద్యార్థులకు రూ. 5000 ఖరీదుగల బ్యాగులు విరాళంగా అందజేశారు. హెచ్ఎంలు శ్రీలత, రజిని ఉన్నారు.

ఈఓపై దాడిచేసిన వారిని శిక్షించాలి

ఆసిఫాబాద్అర్బన్: భద్రాచలం దేవాలయ భూములలో అక్రమదారులను తొలగించే ప్రక్రియలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి రమాదేవిపై దాడికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కార్యనిర్వాహణ అధికారుల సంఘం ఉపాధ్యక్షుడు గర్రెపల్లి వేణుగోపాల్ గుప్తా మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

గుంతలు పూడ్చిన స్థానికులు

కౌటాల: మండలంలోని తాటిపల్లి గ్రామంలోని అంతర్గత రోడ్లపై గల గుంతల్లో వర్షపు నీరు నిలిచి రోడ్డు బురదమయంగా మారుతుండడంతో స్థానికులు శ్రమదానం చేసి మంగళవారం గుంతల్లో కంకర చిప్స్ వేసి గుంతలు పూడ్చారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

జైనూర్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం కుమురంభీం కూడలిలో వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో ఆసిఫాబాద్ నుంచి జైనూర్కు ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'దివ్యాంగులకు పెన్షన్లు ఇచ్చే స్థలాన్ని మార్చాలి'



వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలో దివ్యాంగులకు పెన్షన్లను పోస్టాఫీసులో కాకుండా మరో చోట ఇవ్వాలని మంగళవారం సదరం, పెన్షన్స్ ఇన్చార్జి శేషారావ్ జాదవ్కు దివ్యాంగులు వినతిపత్రం సమర్పించారు. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి ఇస్లాం బిన్ హసన్ మాట్లాడుతూ పోస్టాఫీసుకు వెళ్లే దారి గుంతలతో బురదమయంగా మారడంతో పెన్షన్దారులు ఇబ్బందులు పడుతున్నార న్నారు. దివ్యాంగుల క్షేమం కోసం పెన్షన్ల పంపిణీ స్థలాన్ని మార్చాలని, లేదంటే బ్యాంక్ ఖాతాల ద్వారా నగదు జమ చేయాలని కోరారు. రాజయ్య, రమేశ్ ఉన్నారు.

సేంద్రియ ఎరువులతో దిగుబడులు

కాగజ్నగర్రూరల్: సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు పొందవచ్చని ఏవో రామకృష్ణ అన్నారు. మంగళవారం వంజీరి రైతువేదికలో వర్షాకాలంలో పంటల సాగులో తీసుకోవాల్సిన మెలకువలు, జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఈవో సృజన, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ

సిర్పూర్(టి): మండలంలోని గ్రామాల్లో మంగళవారం ఎంపీడీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. సిర్పూర్(టి), పారిగాం, కర్జెపెల్లి, లోనవెల్లి, డోర్పల్లి గ్రామాల్లో ఇంటింటా మొక్కలు పంపిణీ చేశారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. అనంతరం నూతనంగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలను పునఃపరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతి, సిబ్బంది ఉన్నారు.

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ

ఆసిఫాబాద్అర్బన్: గత ఆర్థిక సంవత్సరం 2024 –25లో మండలంలో జరిగిన ఉపాధిహామీ పనులపై ఎంపీడీవో శ్రీనివాస్ అధ్యక్షతన సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం ఉపాధిహామీ పనుల్లో చేపట్టిన 293 పనులకు మొత్తం కూలీల ఖర్చు రూ. 8,82,96,852 కాగా, మెటీరియల్ ఖర్చులకు రూ. 23,83,939 చేసినట్లు పేర్కొన్నారు. ఎస్ఆర్పీ రవి, డీఆర్పీలు, సాంకేతిక సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

రైతులకు కంది విత్తనాలు పంపిణీ



విత్తనాలు అందజేస్తున్న అధికారులు

బెజ్జూర్: రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ఉచితంగా విత్తనాలు అందజేస్తుందని ఏఈవో మీనా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల కేంద్రానికి చెందిన రైతులకు కంది విత్తనాలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఉచిత విత్తనాలను ప్రభుత్వం సొసైటీ ద్వారా రైతులకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. యూరియాను రెండు రోజుల్లో పంపిణీ చేస్తామని తెలిపారు. రైతులు అధిక ధరలు పెట్టి యూరియా కొనుగోలు చేయకుండా నానో యూరియా వాడాలని సూచించారు.

'మహిళా శక్తి' సమావేశం



మాట్లాడుతున్న మహిళా సంఘం సభ్యురాలు

వాంకిడి: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మంగళవారం మహిళా శక్తి సంబరాల్లో భాగంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డీ లేని రుణాలు, సంఘాలలో లేని మహిళలను చేర్పించడం, వృద్ధులకు సంఘాల ఏర్పాటు, కిశోర బాలికల సంఘాలు, దివ్యాంగులకు కొత్త సంఘాలు, లోన్ బీమా, ప్రమాద బీమాలపై చర్చించారు. మహిళా శక్తి సంబరాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని సన్మానించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనులు, ఆర్థిక, సామాజిక ప్రణాళికపై చర్చించారు. అనంతరం కార్యాలయం ఆవరణలో మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఏపీవో శ్రావణ్ కుమార్, ఎంపీవో మహేశ్, ఎస్బీఎం సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బూత్స్థాయి అధికారులకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న ఆర్డీవో లోకేశ్వర్రావు

వాంకిడి: మండల కేంద్రంలోని రైతువేదికలో ఆర్డీవో లోకేశ్వర్రావు ఆధ్వర్యంలో బూత్స్థాయి అధికారులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బీఎల్వోలకు ఫారం 6, 7, 8, 6(బీ)లపై అవగాహన కల్పించారు. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఫారం 6, ఫారం 8తో పేరు, చిరునామా సవరణ చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటుహక్కుపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటుహక్కు పొందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తహసీల్దార్ కవిత, డిప్యూటీ తహసీల్దార్ రాంలాల్, బీఎల్వో సూపర్వైజర్లు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

'గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు'



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్ కుమార్

వాంకిడి: కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన పీఎం జన్మన్, పీఎం జుగా పథకాలతో గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు సమకూర్చనున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని సోనాపూర్ గ్రామ పంచాయతీలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాలను అమలు చేస్తుందని, విద్య, వైద్యం, జీవనోపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శి విద్యశ్రీ, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్ జయంతి



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

రెబ్బెన: ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్రెడ్డి జయంతి మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఆర్టీఏ సభ్యులు లావుడ్య రమేశ్ కేక్కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ రాష్ట్ర ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవాజీ, మాజీ జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, మాజీ సర్పంచ్ సోమశేఖర్, నాయకులు మురళీ, ఆనంద్రావు, శ్రీనివాస్గౌడ్, రాజేశ్, రఘుపతి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై విచారణ



కోత్మీర్లో విచారణ చేపడుతున్న డీఎల్పీవో

దహెగాం: మండలంలోని కోత్మీర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లపై విచారణ చేపట్టారు. లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని జిల్లా కలెక్టర్కు గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో మంగళవారం డివిజన్ పంచాయతీ అధికారి అహ్మద్ ఉమర్ ఉస్సేన్ విచారణ చేపట్టారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించారు. విచారణ నివేదికను కలెక్టర్కు నివేదిస్తామని పేర్కొన్నారు. ఎంపీవో రవికుమార్, పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ, తదితరులు ఉన్నారు.